క్లుప్తంగా

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


కుమార్ (ఫైల్)

వేలేరు : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని జానకిపురం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై డి.హరిత తెలిపిన వివరాల ప్రకారం.. జానకిపురం గ్రామానికి చెందిన తొట్టె కుమార్(37) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. ఈనెల 25న వ్యక్తిగత పనిపై మండలంలోని మల్లికుదుర్ల గ్రామానికి వచ్చి వెళ్తున్న క్రమంలో రాత్రి 9.30 గంటల సమయంలో మల్లికుదుర్ల శివారులో రోడ్డు ప్రక్కన ఎలాంటి సిగ్నల్స్ లేకుండా రెండు బైక్‌లు పార్క్ ఉన్నాయి. చీకట్లో గమనించని కుమార్ ఆ బైక్‌లను ఢీకొని రోడ్డు కింద పడిపోవడంతో తీవ్ర రక్తస్రావం అయ్యింది. గమనించిన చుట్టుపక్కలవారు 108కు సమాచారం అందించారు. చికిత్స పొందుతున్న కుమార్ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య తొట్టె రవళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై హరిత పేర్కొన్నారు.

ఫోన్ ట్యాపింగ్‌పై దర్యాప్తు చేయించాలి

హన్మకొండ: గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌పై ఉన్నత స్థాయి దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీలతో దర్యాప్తు చేయించాలని తెలంగాణ ఉద్యమకారుల కమిటీ రాష్ట్ర చైర్మన్, ప్రముఖ సామాజిక ఆర్థిక రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ సూచించారు. హనుమకొండ బాలసముద్రంలోని స్వగృహంలో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కుటుంబ స్వార్థ రాజకీయాలకు ఫోన్ ట్యాపింగ్‌ను కేసీఆర్ వాడుకున్నారని విమర్శించారు. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద కుంభకోణమని తెలిపారు. ఫోరం ఫర్ బెటర్ వరంగల్ అధ్యక్షుడు పుల్లూరు సుధాకర్ మాట్లాడుతూ కేంద్రం, రిజర్వ్ బ్యాంక్ అనుమతి లేకుండా ఇజ్రాయిల్ మిషనరీని తెప్పించుకోవడం మనీ ల్యాండరింగ్ కింద తీవ్రమైన నేరంగా పరిగణిస్తారని అన్నారు. సామాజిక వేత్త బొమ్మినేని పాపిరెడ్డి, సోమ రామ్మూర్తి, సతీష్ పాల్గొన్నారు.

కాలం తెచ్చిన కరువు

హన్మకొండ: వర్షాలు లేక, కాలం కలిసి రాక కరువు పరిస్థితులు ఏర్పడితే.. కాంగ్రెస్ తెచ్చిన కరువు అని బీఆర్‌ఎస్ నాయకులు అనడం వారి అవివేకానికి, అజ్ఞానానికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా చైర్మన్ గుగులోతు రవీందర్ నాయక్ తెలిపారు. అక్టోబర్ చివరి వరకు వర్షాలు పడాల్సి ఉండగా గత సంవత్సరం ఆగస్టు వరకు మాత్రమే కురిశాయని, ఆ తర్వాత వర్షాభావ పరిస్థితులు నెలకొనగా జలాశయాల్లో నీటి మట్టం తగ్గిందని ఒక ప్రకటనలో వివరించారు.

ఈద్గా అభివృద్ధికి కృషి చేయాలి

ఖిలా వరంగల్: రంజాన్ ప్రార్థనలకు అనుకూలంగా ఉండేలా ఫోర్ట్ రోడ్డులోని ఈద్గా అభివృద్ధికి కృషి చేయాలని ఈద్గా సభ్యులు కోరారు. తూర్పు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ మురళీధర్‌రావును ఈద్గా అధ్యక్షుడు ఎంఏ.జబ్బార్, సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. చాంద్‌పాషా, మొహినొద్దీన్, సాబీర్ ఉస్సేన్ అలీ, షకీల్, అమ్జద్, సలామొద్దీన్, అశ్రఫ్, అంకుస్, యాకూబ్, జానీ, మాషుక్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవన్‌కు శుభాకాంక్షలు

ఖిలా వరంగల్: వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన తీగల జీవన్‌గౌడ్‌ను పడమరకోటలోని స్వగృహంలో ఆయనను పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జీవన్‌కు విశ్వనాథకాలనీ అధ్యక్షుడు కర్నె రవీందర్, గణేష్‌నగర్ కాలనీ ప్రతినిధి గణేష్, సత్యసాయినగర్ కాలనీ ప్రతినిధి శ్రీనివాస్ గుప్తా, గోపా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మీనారాయణ, మండ శ్యామ్ పుష్పగుచ్ఛం అందజేశారు.

అగ్నిప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

వరంగల్ / కాశిబుగ్గ: వరంగల్ పోచమ్మమైదాన్‌లోని జకోటియా మాల్‌లో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన వ్యాపారులను ప్రభుత్వం ఆదుకోవాలని వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్, బీజేపీ నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావు సూచించారు. మాల్‌ను శుక్రవారం సందర్శించి అగ్నిప్రమాదంలో జరిగిన నష్టాన్ని పరిశీలించి, వ్యాపారులను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

నేటి నుంచి అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

కరీమాబాద్: గ్రేటర్ వరంగల్ పరిధిలోని గణేష్‌నగర్‌లో శనివారం నుంచి సోమవారం వరకు అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నెల్లూరు శ్రీనివాసరావు, సుతారి రాజులు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. రాధాకిషన్, విజయ్, సారంగం, రంజిత్, రవీందర్, రవిబాబు, లక్ష్మీనారాయణ, అశోక్, రాకేష్, శ్రీనివాస్, సాంబయ్య, కొమురెల్లి, సుమన్ పాల్గొన్నారు.

క్రీస్తు సిలువ మానవాళికి రక్షణ

- జిల్లా వ్యాప్తంగా గుడ్‌ఫ్రైడే వేడుకలు
- ప్రత్యేక ప్రార్థనలు చేసిన క్రైస్తవులు


ధర్మసాగర్ : సిలువమార్గం నిర్వహిస్తున్న క్రైస్తవులు

దామెర : ఏసుక్రీస్తు సిలువ మానవాళికి రక్షణ ఫలమని వరంగల్ కతోలిక గురుపీఠం, ఆత్మకూరు విచారణ గురువు ఫాదర్ గంగారపు సురేష్ అన్నారు. మండలంలోని ఊరుగొండలో శుక్రవారం గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకొని క్రీస్తు సిలువ శ్రమల రక్షణ యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పాటలు పాడుతూ, ప్రార్థనలు చేశారు. ఆధ్యాత్మిక, ధ్యాన, మౌన, పాప పశ్చాత్తాప, పరివర్తన భావాలతో వేడుక కొనసాగింది. ఈ కార్యక్రమంలో యువతీ, యువకులు, మహిళలు, బాల బాలికలు పాల్గొని సకల మానవాళి పాప పరిహారం కోసం లోక రక్షకుడు యేసు క్రీస్తు మోసిన సిలువను అనుభవించిన భయంకర మరణ వేదనను నాటక రూపంలో ప్రదర్శించారు. క్రీస్తు సిలువ పాటుల యాత్ర అందరి హృదయాలను కలిచివేసింది. అనంతరం ఫాదర్ తాటికొండ జోసెఫ్, కిరణ్ మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు ప్రేమ, త్యాగ మార్గాన్ని అందరూ అనుసరించాలని సందేశమిచ్చారు.

ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూరుతోపాటు ఎల్కతుర్తి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నుంచి కారుణ్యమాత క్యాతలిక్ చర్చి వరకు క్రైస్తవులు గుడ్‌ఫ్రైడే వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఏసుక్రీస్తు వేషాధరణతో ముళ్లకిరీటం తలపై ధరించి శిలువను మోస్తూ ప్రదర్శించారు. క్రైస్తవ మహిళలు బిందెలతో నీళ్లు తెచ్చి యేసు కాళ్లపై పోసి నమస్కరించుకున్నారు. అనంతరం భటులు సిలువ మోస్తున్న యేసును కొరడాలతో కొట్టుకుంటూ తీసుకెళ్లడం అందరి హృదయాలను కలచివేసింది. ఫాదర్ నవీన్, శివకుమార్, జయరాజ్, ఆనందర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : మండల కేంద్రంలోని షారోన్ చర్చిలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ పాన్నటి ఏసన్నసాదు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రైస్తవ మత విశ్వాసం ప్రకారం యేసుక్రీస్తు శుక్రవారం శిలువ వేయబడినందుకు గుడ్‌ఫ్రైడే నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. మానవాళి చేసిన పాపాల కోసం తన ప్రాణాలను జీసస్ సిలువపై పణంగా పెట్టాడని తెలిపారు. గుడ్‌ఫ్రైడే రోజు క్రైస్తవులు ఉపవాసం ఉండి జీసస్‌ను తలుచుకుంటూ ప్రార్థనలో గడుపుతారని ఆయన అన్నారు.


నడికూడ : ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


దామెర : సిలువయాత్ర నిర్వహిస్తున్న క్రైస్తవులు


వేలేరు : క్రీస్తుసిలువ మార్గంలో పాల్గొన్న క్రైస్తవులు


ఎల్కతుర్తి : శిలువను మోస్తున్న క్రైస్తవులు

వేలేరులో..

వేలేరు : మండలంలోని వివిధ గ్రామాల్లో గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మొదటగా క్రైస్తవులు క్రీస్తు మరణాన్ని తెలిపే ఘట్టాలను నాటిక ద్వారా ప్రదర్శించారు. అనంతరం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ధర్మసాగర్‌లో..

ధర్మసాగర్ : మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరుణాపురం గ్రామంలో విచారణ గురువులు ఫాదర్ సుధాకర్ ఆధ్వర్యంలో ప్రధాన వీధుల్లో ఏసుప్రభు సిలువమార్గ ప్రదర్శన నిర్వహించారు. అలాగే కరుణాపురంలో సొసైటీ ఆఫ్ క్రైస్ట్ ఆధ్వర్యంలో జనరల్ సెక్రటరి రెవ డాక్టర్ జయప్రకాష్ గోపు, పాల్సన్‌రాజ్ గుడ్‌ఫ్రైడే వేడుకలు నిర్వహించి ప్రార్థనలు చేశారు.

నడికూడలో..

నడికూడ : మండలంలోని పలు గ్రామాల్లో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

స్వలాభం కోసమే పార్టీ మారుతున్న 'కడియం'

- ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని కార్యకర్తల డిమాండ్


మాట్లాడుతున్న నర్సింగరావు

వేలేరు : వ్యక్తిగత స్వలాభం కోసమే స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి బీఆర్‌ఎస్ పార్టీని వీడుతున్నారని జెడ్పీటీసీ చాడ సరితారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మరిజె నర్సింగరావు ఆరోపించారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ ద్రోహి కడియం శ్రీహరికి మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో అనేక పదవులు ఇచ్చారని గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ పార్టీ కడియం శ్రీహరి కూమార్తె కడియం కావ్యకు పార్టీ సభ్యత్వం లేకపోయినా వరంగల్ ఎంపీ టికెట్ ఇచ్చి గౌరవిస్తే నేడు అదే పార్టీకి ద్రోహం చేశారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల శ్రమతో ఘనపురంలో ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి పదవికి రాజీనామా చేసి పార్టీ మారాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆంగోతు సంపత్, ఎంపీటీసీ బత్తుల జ్యోతి, మాజీ సర్పంచ్ కాయిత మాధవరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు జాని, బీఆర్‌ఎస్ నాయకులు హన్మకొండ రాజు, మహేందర్, ప్రసాద్, కల్యాణ్, శ్రీనివాస్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

దేవాదుల నీటిని వెంటనే విడుదల చేయాలి


చింతలపల్లిలో ఎండిపోయిన పొలాన్ని చూపుతున్న సభ్యులు

ఎల్కతుర్తి : ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి నార్త్ కెనాల్ ద్వారా దేవాదుల నీటిని విడుదల చేసి ఎండుతున్న వరిపంటలను కాపాడాలని రైతు రక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని గోపాల్‌పూర్, చింతలపల్లి గ్రామాల్లో ఎండిపోతున్న వరిపంటలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెట్టప్రాంత గ్రామాల్లో సాగు చేసిన వరిపంట బావుల్లో నీరు అడుగంటిపోయి వరిపొలాలు నెర్రలు బారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి దేవాదుల నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. లేనిపక్షంలో రైతులకు పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు భాస్కర్, వాంకె రాజు, హింగె రవీందర్‌రావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు


మాట్లాడుతున్న సీఐ క్రాంతికుమార్

ఆత్మకూరు : రౌడీషీటర్ ఓపెన్ అయినవారు నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ క్రాంతికుమార్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎక్కడ కూడా చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. ప్రతిఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు.

క్రషర్లను మూసివేయాలని రైతుల ఆందోళన


ఆందోళన చేస్తున్న రైతులు

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక రెవెన్యూ శివారులోని ఈఆర్‌ఆర్ క్రషర్, బాలాజీ రోబో సాండ్‌ను వెంటనే మూసివేయాలని గోవిందాపూర్ గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం ఆందోళనకు దిగి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు దుగ్యాల రజనీకాంత్ మాట్లాడుతూ.. క్రషర్ల నుంచి వచ్చే దుమ్ము వలన పంట పొలాలు నాశనం అవుతున్నాయని ఆరోపించారు. ఆశించిన దిగుబడి రాకపోవడంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. అప్పులు తెచ్చి పంటసాగు చేస్తే వడ్డీలు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొందని వాపోయారు. క్వారీల్లో బోర్ బ్లాస్టింగ్‌లు చేపట్టడం వలన పంట పొలాల్లో పని చేయడానికి కూలీలు భయపడుతున్నారని అన్నారు. చుట్టు పక్క గ్రామాల్లో ఇళ్లకు పగుళ్లు ఏర్పడుతున్నాయని, దుమ్ము వలన ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. క్రషర్ యాజమానులు అక్రమంగా రైతుల భూములను ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, తహసీల్దార్ నోటీలు జారీ చేసి వెంటనే క్రషర్లను మూసివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు ఉడుత మహేందర్, రాజయ్య, శ్రావణ్‌కుమార్, వీరేశం, సంతోష్, సంతు, రామయ్య, శంకర్, సదయ్య, చంద్రయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌లో విద్యుత్ కోతల్లేవు

- డీఈ భిక్షపతి

వర్ధన్నపేట : వర్ధన్నపేట డివిజన్‌లో విద్యుత్ కోతలు విధించడం లేదని ఆ శాఖ వరంగల్ డీఈ భిక్షపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనివార్య పరిస్థితుల్లో మరమ్మతుల సమయంలో మాత్రమే కొంత అంతరాయం కలిగే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. అప్పటికప్పుడు ఏర్పడే సాంకేతిక సమస్యల వల్ల పట్టణంలోని కాలనీల్లో అక్కడక్కడా ఒకటి లేదా రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని స్పష్టం చేశారు. రెండ్రోజుల క్రితం పట్టణంలోని రాజస్థాన్ వీధిలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయడంలో భాగంగా రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపేసినట్టు తెలిపారు. ఎక్కడైనా మరమ్మతులు జరిగితే ముందు రోజు పత్రికా ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేస్తామని పేర్కొన్నారు.

'మాదిగ భవనాలు నిర్మించాలి'

పర్వతగిరి : రాష్ట్రంలో 80 లక్షల జనాభా ఉన్న మాదిగ కులస్తుల కోసం అన్ని జిల్లాల్లో మాదిగ భవనాలు నిర్మించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు కేదాసి మోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని జిల్లా కేంద్రాల్లో మాదిగ భవనాల కోసం స్థలం కేటాయించి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయడంతోపాటు రాజధానిలో ఎకరం స్థలం కేటాయించి భవనం నిర్మించాలని కోరారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొమ్ముల భిక్షపతి, వరంగల్ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వక్కల కుమార్, వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొట్ల రమేశ్, నాయకులు బొట్ల కనకరాజు, సంకినేని సంతోశ్, సంకినేని రాజు, బొట్ల పెద్ద వెంకటేశ్వర్లు, మునిగ రఘు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో ఊపందుకున్న చేరికలు


కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో ఎమ్మెల్యే నాగరాజు, డీసీసీబీ చైర్మన్, ఎంపీపీ

ఐనవోలు : కాంగ్రెస్ పార్టీలో చేరికలు ఊపందుకున్నాయి. శుక్రవారం వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని ఐనవోలు, వర్ధన్నపేట మండలాల నుంచి సుమారు 500 మంది వివిధ పార్టీలకు చెందిన నాయకులు వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఎంపీపీ మార్నేని మధుమతి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కండువా కప్పి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి గ్రామం నుంచి కాంగ్రెస్‌లో చేరేందుకు నాయకులు క్యూ కడుతున్నారంటే కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు ఉన్న అభిమానం, నమ్మకమే అన్నారు. కొత్తగా చేరుతున్న నాయకులు ఎలాంటి షరతులు లేకుండా పూర్వ కాంగ్రెస్ నాయకులతో కలిసిపోవాలన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. మండలంలోని 17 గ్రామాలు, వర్ధన్నపేట నుంచి 3 గ్రామాల నుంచి సుమారు 600 మంది మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ, మండల, గ్రామ నాయకులు కాంగ్రెస్‌లో చేరినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సమ్మెట మహేందర్‌తోపాటు పూర్వ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం


టాస్ వేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న రాంబాబు

నర్సంపేట : క్రీడలతో శారీరక, మానసిక వికాసం కలుగుతుందని బీజేపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు, కౌన్సిలర్ శీలం రాంబాబు తెలిపారు. పట్టణంలో తలపెట్టిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను శుక్రవారం ఆయన టాస్ వేసి ప్రారంభించి మాట్లాడారు. యువత చదువులకే పరిమితం కాకుండా ఆటపాటల్లోనూ నైపుణ్యత పెంచుకోవాలని సూచించారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని చెప్పారు. టోర్నమెంట్ ఆర్గనైజర్ మాట్లాడుతూ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు శీలం అయోధ్య జ్ఞాపకార్థం ప్రథమ బహుమతిగా రూ.40 వేలతోపాటు షీల్డ్ అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గోల్యానాయక్, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి కొంపెల్లి రాజు, గూడూరు సందీప్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల రాము, సీనియర్ నాయకుడు కూనమల్ల పృథ్వీరాజ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు నూనె రంజిత్, యువ మోర్చా పట్టణ అధ్యక్షుడు అచ్చ దయాకర్, ప్రధాన కార్యదర్శి భవానీ శంకర్, యువమోర్చా ఉపాధ్యక్షుడు కోమల సప్తగిరి, పట్టణ ఉపాధ్యక్షులు మల్యాల సాంబమూర్తి, ఠాకూర్ శివాంజనేయసింగ్, కందికొండ శ్రీను, మద్దెల శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శులు ఠాకూర్ విజయ్‌సింగ్, సామల పవ్రీణ్‌కుమార్, వరంగంటి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులను వినియోగించుకోవాలి


కూలి రేట్లపై అవగాహన కల్పిస్తున్న ఏపీఓ శారద

దామెర : జాతీయ ఉపాధిహామీ పనులను కూలీలు వినియోగించుకోవాలని ఏపీఓ శారద అన్నారు. మండలంలోని ల్యాదెళ్ల చెరువు సమీపంలో చేపడుతున్న ఉపాధిహామీ పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఏప్రిల్ 1 నుంచి కూలి రేట్లు రూ.272 నుంచి రూ.300 వరకు పెంచుతున్నట్లు తెలిపారు. జాబ్‌కార్డు కగిలిఉన్న ప్రతి కూలీకి 100 రోజుల పని కల్పిస్తామని అన్నారు. కూలీలు అధిక సంఖ్యలో హాజరుకావాలని సూచించారు. అనంతరం నర్సరీని పరిశీలించి వనసేవకులకు పలు సూచనలు చేశారు. మొక్కలను కాపాడాలని ఈ సందర్భంగా సూచించారు. ఆమెతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్ సుకినె శ్రీనివాస్, కూలీలు ఉన్నారు.

'పార్లమెంట్ టికెట్ మాదిగలకే ఇవ్వాలి'


బొట్ల రమేశ్‌కు కండువా కప్పుతున్న మోహన్

వర్ధన్నపేట : మాదిగ సామాజికవర్గానికి చెందిన నాయకుడికే వరంగల్ పార్లమెంట్ టికెట్ ఇవ్వాలని అన్ని రాజకీయ పార్టీలను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు కేదాసి మోహన్ కోరారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో 80 లక్షలు జనాభా కలిగిన మాదిగలకు ఎంపీ టికెట్ల కేటాయింపులో అన్ని పార్టీలు మోసపూరితంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. జాతీయ, ప్రాంతీయ పార్టీలు వైఖరి మార్చుకుని రిజర్వ్ అయిన మూడు ఎంపీ స్థానాలను మాదిగలకు మాత్రమే ఇవ్వాలన్నారు. అనంతరం పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన బొట్ల రమేశ్‌ను ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమిస్తున్నట్టు ప్రకటించారు. రమేశ్‌ను కండువా కప్పి అభినందించారు. సమావేశంలో నాయకులు కొమ్ముల భిక్షపతి, వక్కల కుమార్, రమేశ్, సన్నీ, సిద్ధు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా విక్రమ్

వర్ధన్నపేట : వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా మండలంలోని కట్ర్యాల గ్రామానికి చెందిన న్యాయవాది బండారి విక్రమ్ ఎన్నికయ్యారు. ఆ జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం నిర్వహించగా విక్రమ్ బరిలో నిలిచి గెలిచారు. తన విజయానికి సహకరించిన న్యాయవాదులకు విక్రమ్ కృతజ్ఞతలు తెలిపారు.

కంఠమహేశ్వరస్వామికి జలాభిషేకం

చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపల్లిలో గల కంఠమహేశ్వరస్వామికి గౌడ కులస్తులు శుక్రవారం జలాభిషేకం చేశారు. ఉత్సవాల్లో భాగంగా గౌడ కులస్తులు ఇళ్ల నుంచి శుద్ధ జలాలతో గ్రామంలోని కంఠమహేశ్వరస్వామి, ఎల్లమ్మ, వన మైసమ్మ ఆలయాలకు చేరుకుని జలాభిషేకం చేశారు. కుల పెద్దలు ప్రభాకర్, అధ్యక్షుడు స్వామి, మాజీ అధ్యక్షుడు రమేశ్, నాయకులు సుదర్శన్, నరేందర్, రవి, సుధాకర్, గండు రాజు పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న డీడీఓపీ



ఐనవోలు : మండల కేంద్రంలోని మల్లికార్జునస్వామి ఆలయాన్ని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సత్యనారాయణ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. వేదపండితులు మధుకర్‌శర్మ, రవీందర్ సన్మానించి స్వామివారి వస్త్రాలు, చిత్రపటాన్ని అందించారు.

అక్రమ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

వేలేరు : అక్రమంగా మద్యం విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హరిత హెచ్చరించారు. మండలంలోని గుండ్లసాగర్ గ్రామంలో గల ఓ కిరాణాషాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రాజమణిపై కేసు నమోదు చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రూ.5,379 విలువ గల మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడినా కేసులు నమోదు చేస్తామని అన్నారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులను నియంత్రించేందుకు ప్రత్యేక కార్యచరణ రూపొందించినట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆమె కోరారు.